క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

కొత్తపేట: నూతనంగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు కారణంగా కొత్తపేట పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు, వాడపాలెం, గంటి, పలివెల గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా అడ్డాల

పి.గన్నవరం: బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఊడిమూడి గ్రామానికి చెందిన నాయకుడు అడ్డాల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు నుంచి నియామకపు ఉత్తర్వులు అందాయి. జిల్లాలో పార్టీ పటిష్టకు కృషి చేస్తానని వెంకటేశ్వరరావు తెలిపారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నేతలు

మామిడికుదురు: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఎస్పీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు సూచించారు. మామిడికుదురు మండల పార్టీ కార్యాలయంలో గురువారం కోనసీమ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన భీమారావు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అన్ని నియోజకవర్గాల్లో బీఎస్పీ పోటీ చేసే దిశగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. పి.గన్నవరం నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థిగా విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ కొల్లాబత్తుల సత్యాన్ని ప్రకటించామన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జిలు కాంఢ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీభవాని, పార్టీ నేతలు కుసుమ వెంకటేశ్వరరావు, కోలా త్రిమూర్తులు, సాకా రాజారావు, పెండం శ్రీనివాస్, నాగవరపు ఏడుకొండలు, బుడితి దయామహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్‌ను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు మందును అందజేశారు. ఎనిమియా నివారణకు ప్రతి గురువారం ఈడ్రాప్స్ అందించనున్నట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఈఓ కె జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం. శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు

అంబాజీపేట: శర్నవరాత్ర ఉత్సవాలు ముగింపులో భాగంగా అంబాజీపేట మండలంలో పలు గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపును గురువారం ఘనంగా నిర్వహించారు. పశువుల మార్కెట్‌లో ఉన్న విజయ కనకదుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలోను, ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లు, నందంపూడి, తొండవరం, వాకలగరవు, మెట్లకాలనీలో దుర్గమ్మ అమ్మవారి విగ్రహ ఊరేగింపు ఉత్సాహంగా నిర్వహించారు.

ఆనందాల హరిఇల్లు

- నెరవేరిన పేదోడి సొంతింటి కల
- నిర్మాణంలో ఉన్న ఇళ్లు
- మూడు నియోజకవర్గాల్లో 4,650 ఇళ్లు మంజూరు

రాజోలు: పేదలు సొంతగూడు లేక నానాఅవస్థలు పడేవాళ్లు. అద్దె ఇళ్లల్లో ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లు. ఏటిగట్టు, కాలువ గట్లు, పుంత గట్ల వెంబడి నివాసాలు ఉంటూ అష్టకష్టాలు పడేవారు. ఇప్పుడు ఆ కష్టాలకు చెక్ పడింది. వారి సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారు. ప్రజా సంకల్పయాత్రలో ఆయన ఇచ్చిన హామీల్లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారుల గుండెల్లో గూడు కట్టుకున్నారు. పేదలకు సెంటున్నర స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించుకోవడానికి సాయం అందించారు. దీంతో లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకుంటున్నారు. జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. పేదల సొంతింటి కల నెరవేరడంతో వారి ఆనందానికి హద్దుల్లేవు.

మూడు నియోజకవర్గాల్లో 4,650 ఇళ్లు మంజూరు

రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో రాజోలు, మామిడికుదురు, ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు 4,650 ఇళ్లు మంజూరు కాగా 3,171 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల పనులు ప్రారంభించారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. లబ్ధిదారుడే గృహనిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసుకుని సొంతంగా పనులు నిర్వహించుకుంటే నేరుగా లబ్ధిదారుడికి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం విడుదల చేసిన మొత్తాన్ని మూడు దఫాల్లో జమ చేస్తారు. లబ్ధిదారుడి కోరిక మేరకు గృహనిర్మాణ శాఖ మెటీరియల్ కూడా సరఫరా చేస్తుంది. నిర్మాణ కూలీ ఖర్చులను లబ్ధిదారుడి ఖాతాకు జమ చేస్తారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో 557 మంది ఇళ్లు శ్లాబ్ పనులు పూర్తి చేశారు. వీరిలో సుమారు 100 మందికి పైగా గృహ ప్రవేశాలు చేసుకుని నివాసం ఉంటున్నారు. ఇంటి నిర్మాణం చేసుకోలేని లబ్ధిదారులు రూ.70 వేలు చెల్లిస్తే గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇంటి పనులు చేపట్టి శ్లాబ్ పూర్తి చేసి, నివాసం ఉండేందుకు ఒక గదిని పూర్తి చేసి ఇస్తున్నారు.


తాటిపాకలోని జగనన్న కాలనీలో పూర్తయిన ఇల్లు


పొదలాడ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు

ఆనందంగా ఉంది



పొదలాడ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. పదేళ్లుగా అద్దె ఇంట్లో చాలా ఇబ్బందులు పడ్డాం. సీఎం జగనన్న ఇంటిస్థలం, గృహనిర్మాణం మంజూరు చేయడంతో సొంత ఇంటిని నిర్మించుకుని జగనన్న కాలనీలోకి నివాసం వచ్చాం. మా ఇంటి కష్టాలను తీర్చారు. ఆయన రుణం తీర్చుకోలేం.

– బత్తుల దుర్గాభవానీ, పొదలాడ

నెరవేరిన 20 ఏళ్ల కల



మాది పొదలాడ ఇందిరాకాలనీ, ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు నివాసం ఉండేవాళ్లం. చాలా ఇబ్బందిగా ఉండేది. ఇరవై ఏళ్లుగా ఇంటి పట్టా కోసం తిరిగాను. సీఎం జగనన్న వచ్చిన వెంటనే ఇళ్ల స్థలం ఇచ్చారు. దానిలో ఇంటి పట్టా ఇచ్చి గృహనిర్మాణం మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తయింది. సొంతిల్లు ఉండడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

– తాడి సరోజిని, పొదలాడ

ప్రభుత్వ సాయం



లబ్ధిదారులు ఇష్టం మేరకు ఇంటి నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్నాం. లబ్ధిదారులు సొంతంగా ఇంటి నిర్మాణం చేసుకుంటే మూడు దఫాల్లో రూ.1.80 లక్షలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నాం. కొంత మందికి మెటీరియల్ ఇస్తున్నాం. నిర్మాణం చేసుకోలేకపోతున్నామనే వారికి గృహనిర్మాణ శాఖ ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం.

– ఆకుల సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ, రాజోలు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేట బండారుపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట శివారు బండారుపేట గ్రామంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆర్థిక అవసరాలు తీర్చి వెలుగు తీసుకురావడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జగన్ నాయకత్వంలో మనందరి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. వాటిని సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అని అన్నారు. బండారుపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో ఆ గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు చీరలు పరిచి వాటిపై నడిపించగా యువతులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అనేక మంది గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వచ్చే నెల 26న జగ్గిరెడ్డి 48వ పుట్టిన రోజు సందర్భంగా ముందుగానే యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో 48 కేజీల కేక్‌ను ఏర్పాటు చేసి జగ్గిరెడ్డితో కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల చంద్రావతి, పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మట్టపర్తి సూర్యచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి వీవీ రామన్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో అర్చకునికి తీవ్ర గాయాలు

పి.గన్నవరం: ఆర్బీ రోడ్డులో యర్రంశెట్టివారిపాలెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక అర్చకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామానికి చెందిన మానేపల్లి వెంకటలక్ష్మీ నర్సింహశర్మ గత కొంతకాలంగా పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నారు. ఆయన అక్కడే నివాసం ఉంటున్నారు. గురువారం ఆయన మోటారుసైకిల్‌పై రావులపాలెం వైపు వెళ్తుండగా యర్రంశెట్టివారిపాలెం వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో ఆయనను స్థానికులు పి.గన్నవరం సీహెచ్‌సీకి, అక్కడి నుంచి అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- కొత్తపేటలో మహిళలకు పట్టాల పంపిణీ

కొత్తపేట: రాష్ట్రంలో పేదలకు సొంతిళ్లు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట, పసరిసర గ్రామాలకు చెందిన 58 మంది మహిళలకు స్థానిక పెదగూళ్లపాలెం ప్రాంతంలో కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలను గురువారం సాయంత్రం అధికారులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి వ్యక్తిగతంగా స్థలంతో పాటు పసుపు, కుంకుమ, గాజులు, రవిక అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మళ్లీ నేటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. గత టీడీపీలో స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళల పేరునే ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రక ఘట్టానికి నాంది పలికారన్నారు. నియోజకవర్గంలో 343.98 ఎకరాలు భూమి సేకరించి, 17,190 మందికి, ఈ మండలంలో 3,980 మందికి పట్టాలు ఇచ్చామన్నారు. సీఎం జగన్ ప్రజల కోసం అనేక పథకాలు వంద శాతం అమలు చేస్తున్నారని, భవిష్యత్‌లో కూడా ఈ పథకాలన్నీ అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నే అధికారంలోకి రావాలన్నారు. అందరం ఆయనకు అండగా ఉందన్నామన్నారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు చావలి సుబ్బరాయశాస్త్రి, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మట్టపర్తి సూర్యచంద్రరావు, మండల బీసీ విభాగం సభ్యుడు రాయుడు కృష్ణ, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, డీటీ ఎస్.శ్రీనివాస్, ఆర్ఐ కే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసి పసుపు కుంకుమలు అందచేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో ఆర్డీఓ


స్వామి వారిని దర్శించుకున్న ఆర్డీఓ కేశవర్ధనరెడ్డి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని అమలాపురం ఆర్డీఓ కేశవర్ధనరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన బాలబాలాజీని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని బహూకరించి, ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి చిత్రపటంతోపాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు గూటం శ్రీనివాస్, చిట్టాల సత్తిబాబు, మద్దాలి తిరుమలశింగరాచార్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీసీసీ జనరల్ సెక్రటరీగా ఆరీఫ్



అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఏపీసీసీ) జనరల్ సెక్రటరీగా అంబాజీపేటకు చెందిన ఎండీ ఇస్మాయిల్ ఆరీఫ్ ఎన్నికయ్యారు. ఇటీవల ఏపీసీసీ నూతన కమిటీని ప్రకటించినట్టు ఆరీఫ్ గురువారం తెలిపారు. తనకు జనరల్ సెక్రటరీగా పదవి లభించేందుకు సహకరించిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్‌రావు, జిల్లా ఇంచార్జి సుంకర పద్మశ్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన పదవిపై నిబద్ధతతో పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వైనతేయ నదీతీరంలో రావణ దహనం


పెదపట్నంలో రావణ దహనం చేస్తున్న దృశ్యం

మామిడికుదురు: మేళ తాళాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు నడుమ బుధవారం రాత్రి పెదపట్నం గ్రామంలోని వైనతేయ గోదావరి నదీ తీరంలో రావణ దహనం కన్నుల పండుగలా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై రావణ దహనాన్ని వీక్షించారు. శ్రీదేవి శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తుల పూజలందుకున్న దుర్గమ్మ విగ్రహాన్ని వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అనంతరం రావణ దహనం కార్యక్రమం కన్నుల పండుగలా జరిగింది. అప్పనపల్లి బాడవ కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

రేపు భీమేశ్వరాలయం మూసివేత

రామచంద్రపురం రూరల్: ఈ నెల 28 న రాహుగ్రస్త చంద్ర గ్రహణం కారణంగా మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఆలయం మూసివేసి తిరిగి ఆదివారం ఉదయం 7 గంటలకు సంప్రోక్షణ అనంతరం తెరవనున్నట్టు తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

సుస్వాగతం..






వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ రాజానగరం మండలం దివాన్ చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో గురువారం జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా ఆయనకు ఎంపీ అనురాధ, పి.గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాద్, జెడ్పీ చైర్మన్ విపర్తి వేణుగోపాలరావు స్వాగతం పలికారు.

– మామిడికుదురు, పి.గన్నవరం

ప్రజారోగ్యం.. ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు

మామిడికుదురు: ప్రజలందరి ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. వృద్ధులకు మందులు అందజేశారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సర్పంచ్ జాలెం రమణకుమారి, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కేజీ ప్రశాంత్, కార్యదర్శి తాడి ఏసుబాబు పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రజలందరి ఆరోగ్యం ప్రభుత్వ ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఇసుకపూడిలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ అధ్యక్షులు బొంతు శ్రీనివాస్, దొమ్మేటి సత్యమోహన్, కాకర భీమరాజు, కొల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో జీ.భీమారావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు సందర్శించారు. శిబిరంలో రోగులకు వైద్య సిబ్బంది అందజేస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. పరీక్షలు అనంతరం అవసరమైన వారికి కళ్లజోళ్లను తహసీల్దారు వై.రామకుమారి అందజేశారు. పీటీసీ మందపాటి రత్నం, పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.


నగరంలో సామూహిక సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు


అంతర్వేదిపాలెంలో వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యురాలు


ఎల్.గన్నవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సురక్షతో కార్పొరేట్ వైద్యం

ఆలమూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. పినపళ్ల గ్రామ సచివాలయ పరిధిలో గురువారం సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కె.జాన్ లింకన్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.జానకి రాఘవ, ఏపీఎం ఎం.ధనరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.వీర్రాజు పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో 438 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి రామన్న, మాజీ సర్పంచ్ కోట బూరయ్య, మాజీ ఎంపీటీసీ పాలింగి ఉమాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజ్జన అబ్బు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: నేదునూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవైద్య శిబిరాన్ని సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో 515 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంగన్‌వాడీలు గర్భిణులకు సీమంతాలు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు మంగాదేవి, క్రిస్టోఫర్ వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఎల్.గన్నవరం-2 గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 258 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ ఎం.భారతి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఆర్ఐ పి.నర్సింహారావు, బీవీవీఎస్ఎన్ మూర్తి, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలో వేగివారిపాలెం–చెన్నడం గ్రామ సచివాలయం వద్ద గురువారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ ఆధ్వర్యంలో వైద్య బృందం సభ్యులు రోగులకు సేవలందించారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

రావులపాలెం: కేతరాజుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. మొత్తం 215 మంది వైద్య సహాయం అందించినట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య సేవా వాహనాల సిబ్బంది నియామకం కొరకు దరఖాస్తు ఆహ్వానం

డా. బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు, మలికిపురం, అయినవిల్లి పశువైద్య సంచార వాహనాలకు సంబంధించి ఖాళీగా ఉన్న డ్రైవర్ల పోస్టుల భర్తీ నియామకానికై అర్హులైన అభ్యర్థుల కొరకు దరఖాస్తులను స్వీకరించబడునని జిల్లా మేనేజర్ బి.రత్నరాజు ఒక ప్రకటనలో కోరారు. డ్రైవర్ల పోస్టులకు నియామకం కొరకు 2 నుండి 3 సంవత్సరాల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగియుండాలని ఆయన తెలిపారు. వివరాల కొరకు జిల్లా మేనేజరును 8501004601 మరియు 6303624032 సంప్రదించాలని సూచించారు.